క్లుప్తంగా

గుర్రంపోడు తహసీల్దార్‌గా మహ్మద్ తౌఫిక్ అహ్మద్



గుర్రంపోడు: మండల తహసీల్దార్‌గా మహ్మద్ తౌఫిక్ అహ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఇంద్రపల్లి హుస్సేన్ బదిలీపై జనగామ జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న మహ్మద్ తౌఫిక్ అహ్మద్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, సర్పంచ్ షేక్ మస్రత్ సయ్యద్‌మియా ఘనంగా సన్మానించారు.

ఆర్థికసాయం అందజేత



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పగడాల సైదులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన కూర ముత్యాలు అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన పగడాల సైదులుయాదవ్ ముత్యాలు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



నేత కార్మికులను సన్మానిస్తున్న దేవరకొండ చేనేత సహకార సంఘం సభ్యులు

దేవరకొండ: దేవరకొండ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఇడెం చంద్రమౌళి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వారంలో ఒక్క రోజు చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. ఎన్నో కుటుంబాలు చేనేత వృత్తిలో ఉన్నప్పటికీ.. గిట్టుబాటు ధర, విక్రయ కేంద్రాలు లేకపోవడంతో చాలామంది క్రమక్రమంగా ఈ వృత్తికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు శిరందాసు కృష్ణయ్య, పున్న గోవర్ధన్, గాజుల రాజేష్, పగిడిమర్రి సత్యమూర్తి, పున్న శైలజ, పులిజాల శ్రీనివాస్, చేరిపల్లి జయలక్ష్మి, శిరందాసు శివపార్వతి తదితరులున్నారు.

బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ సభ్యులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రానికి చెందిన కూర ముత్యాలు సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా.. అంత్యక్రియల అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఎవరైనా చనిపోతే 9110362628, 9346534535 నంబర్లకు సమాచారం అందిస్తే అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఫౌండేషన్ కోఆర్డినేటర్ లింగయ్య తెలిపారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ

చందంపేట: మండలంలోని కంబాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నక్క శ్రీనివాస్‌యాదవ్ రూ.1.50లక్షల విలువైన స్పోర్ట్స్ మెటీరియల్, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నక్క వెంకటమ్మ, యాదగిరి జ్ఞాపకార్థం 156 మంది విద్యార్థులకు బ్యాగులు, స్పోర్ట్స్ మెటీరియల్, నోట్ బుక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, ఎంఈఓ సామ్యానాయక్, సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మెటీరియల్, నోట్ బుక్స్, బ్యాగులు పంపిణీ చేస్తున్న నక్క శ్రీనివాస్‌యాదవ్

నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు

- సేకరించిన చెత్త పెంటపాలు
- జాడలేని సేంద్రియ ఎరువుల తయారీ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



ఎల్లాపురంలో నిరుపయోగంగా కంపోస్టు షెడ్డు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేసి వాటితో గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చేలా ప్రభుత్వం ప్రతి గ్రామంలో కంపోస్టు షెడ్లను నిర్మించింది. వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో మండల అధికారులు నిర్లక్ష్యం వహించడంతో అవి వృథాగా మారినట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. తిరుమలగిరి మండలంలోని 34 గ్రామపంచాయతీలకు గాను 32 గ్రామపంచాయతీల్లో ఈ షెడ్లను ఏర్పాటు చేశారు. ఎర్రచెరువుతండా, శ్రీరాంపల్లి గ్రామాల్లో నిర్మాణ పనులు తుది దశకు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఒక్కో షెడ్డుకు ప్రభుత్వం రూ.2లక్షల వరకు వెచ్చించింది. పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేయడమే లక్ష్యంగా ఈ షెడ్లను నిర్మించారు. తడి, పొడి చెత్తను సేకరించి షెడ్లకు వచ్చిన తర్వాత ప్లాస్టిక్ సీసాలతో పాటు ఇతర వస్తువులను వేరు చేయాల్సి ఉంటుంది. కానీ ఇది మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే కొనసాగుతుంది. సుమారు 20 గ్రామపంచాయతీల్లో ఈ షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వ్యర్థ పదార్థాలు, కూరగాయలు, ఇతర వ్యర్థ పదార్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసేలా పంచాయతీ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. సేంద్రియ ఎరువు తయారైన తర్వాత స్థానిక రైతులకు దానిని విక్రయించి దాంతో వచ్చిన నిధులు గ్రామపంచాయతీ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. అయినప్పటికీ మండలంలో చాలా గ్రామాల్లో ఇది కానరావడం లేదు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకే ఈ షెడ్లు నిరుపయోగంగా మారాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

పేరుకే తడి, పొడి..

పంచాయతీల్లో తడి, పొడి చెత్త సేకరణ ఎక్కడా కనిపించడం లేదు. చెత్త సేకరణకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లను సమకూర్చింది. గ్రామపంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ చేస్తున్నా దానిని ఎక్కడో గుంతల్లో పారబోసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో కంపోస్టు షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా సేకరించిన చెత్తను ఎరువుల తయారీకి ఉపయోగిస్తే రైతులకు ఉపయోగపడటంతో పాటు, గ్రామపంచాయతీలకు ఆదాయం వచ్చి అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయని ప్రజలు పేర్కొంటున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం



చాలా గ్రామాల్లో కంపోస్టు షెడ్లలో ఎరువుల తయారీ జరుగుతుంది. కొన్ని గ్రామాల్లో జరగకుంటే వాటిని పర్యవేక్షించి వాటిని కూడా వినియోగంలోకి తీసుకువస్తాం. తడి– పొడి చెత్తను వేరుచేసి ఎరువుగా మార్చడం ద్వారా గ్రామపంచాయతీలకు ఆదాయం వస్తుంది. ఈ ఎరువు రైతులు తన వ్యవసాయ భూముల్లో వాడుకోవడం ద్వారా భూమి సారవంతం అవుతుంది.

– సకినాల పద్మ, ఎంపీఓ, తిరుమలగిరి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: అర్హులైన ప్రతిఒక్కరూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన 13మందికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల చెంతకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొండేటి మల్లారెడ్డి, శ్రీశైలంగౌడ్, బొడ్డుపల్లి కృష్ణ, నరేష్, కొండల్, రవీందర్‌రావు, కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు నివాళి



మిర్యాలగూడ టౌన్: గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



దేవరకొండ: గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్, సీనియర్ నాయకులు పాషానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రవి, పాలేపల్లి ఉదయ్‌కుమార్, వట్టేపు సుధీర్ తదితరులున్నారు.

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యకారుల సమితి ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రవి, సుధీకుమార్, ఉదయ్‌కుమార్, మంద రవి, కోటేష్, రమేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

దేవరకొండ: దేవరకొండ డివిజన్ ప్రజా సంఘాల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు డాక్టర్ ఏకుల రాజారావు, కంబాలపల్లి వెంకటయ్య, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎంహెచ్‌డీ ఆధ్వర్యంలో..

తెలంగాణ మాదిగ హక్కుల దండోరా(టీఎంహెచ్‌డీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎంహెచ్‌డీ జిల్లా కోఆర్డినేటర్ ఎర్ర ఆంజనేయులు, నేనావత్ శివయ్య, ఏసోబు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో..

చింతపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం దళిత సంఘాల నాయకులు గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో నల్లవెల్లి సంజీవ, వింజమూరి రవి, శంకర్, వెంకటయ్య, చంద్రయ్య, మొగిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంచార అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలి



హాలియాలో అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న రాష్ట్ర అధికారి డాక్టర్ భాగేష్ మిశ్రా

మిర్యాలగూడ, హాలియా: పశు వైద్య సంచార అంబులెన్స్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య సేవల అంబులెన్స్ ప్రాజెక్టు రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ భాగేష్ మిశ్రా అన్నారు. సోమవారం మిర్యాలగూడ, హాలియా పట్టణాల్లో పశువైద్య సంచార అంబులెన్స్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంత రైతులకు పశువైద్య సంచార సేవలు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. అంబులెన్స్‌కి సంబంధించిన రికార్డులను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు సకాలంలో వైద్యం అందిస్తూ మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ అబ్దుల్ రహీమ్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

డిండి: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో హైదరాబాద్–శ్రీశైలం హైవేపై సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన మారక లక్ష్మయ్య పని నిమిత్తం తన బైక్‌పై డిండికి వచ్చాడు. పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా డిండి ప్రాజెక్టు సమీపంలో అదే మార్గంలో శ్రీశైలం నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి లక్ష్మయ్య ఎగిరి పడటంతో తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్ఐ సైదులు తెలిపారు.

విద్యార్థుల సంపూర్ణ వికాసానికే 'తొలిమెట్టు'



మిర్యాలగూడ: మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

మిర్యాలగూడ, త్రిపురారం: విద్యార్థుల సంపూర్ణ విద్యా వికాసానికి తొలిమెట్టు కార్యక్రమం అమలు చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బొల్లారం భిక్షపతి అన్నారు. సోమవారం మిర్యాలగూడ, త్రిపురారం ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులపై పట్టు సాధించేలా ఇస్తున్న శిక్షణను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్స్, విద్యార్థులకు వర్క్ బుక్స్ కూడా ఇచ్చామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తూ అభ్యసనా పద్ధతులను మార్చుకోవాలన్నారు. మారిన సమయాలను బట్టి పాఠశాలలను నడపాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ బాలాజీనాయక్, మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులు సాంబశివరావు, లావూరి నాయక్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి, కోల శ్రీనివాస్, తిరుపతి, కర్నాటి వెంకటేశ్వర్లు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

మండలంగా ప్రకటించాలని కలెక్టర్‌కు వినతి

దేవరకొండ: మండలంలోని పడమటిపల్లి గ్రామపంచాయతీని మండలంగా ప్రకటించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్–టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. దేవరకొండ మండల కేంద్రానికి దూరంగా ఉన్న యల్లారెడ్డిబావి, ఇద్దంపల్లి, జిల్లేపల్లి, పాత్లావత్‌తండా, తూర్పుతండాలతో పాటు డిండి మండల కేంద్రానికి దూరంగా ఉన్న బ్రాహ్మణపల్లి, ఎర్రగుంటపల్లి, వావిల్‌కోల్, రామాంతపూర్, శాంతిగూడెం, నిజాంనగర్, కందుకూరు గ్రామపంచాయతీలను కలిపి పడమటిపల్లి మండలంగా ప్రకటించాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమే 'ఆరోగ్యశ్రీ'



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హాలియా: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేసిన పోరాట ఫలితంగానే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం తీసుకొచ్చారని ఎమ్మార్పీఎస్ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మడుపు శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం హాలియా పట్టణంలో ఆరోగ్యశ్రీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి గార్లపాటి ప్రసాద్, నిడమనూరు మండల ఇన్‌చార్జి ఏర్పుల వెంకటయ్య, మండల నాయకులు చిత్రం శ్రీను, అనుముల నాగయ్య, అనుముల సాయి, పగిడిమర్రి చరణ్, రాములపాటి సైదులు, భాషపాక సైదులు తదితరులు ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్

రామగిరి(నల్లగొండ): మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలల్లో వివిధ గ్రూపుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఆగస్టు 9న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ షకీనా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, బాలికల జూనియర్ కళాశాలల్లో బైపీసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. నల్లగొండ రెడ్డి హాస్టల్‌లో జరిగే స్పాట్ కౌన్సిలింగ్‌కు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పెంచిన మెస్ చార్జీలను అమలు చేయాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ: ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లకు పెంచిన మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. సోమవారం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురుకులాలకు, హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించి 6 సంవత్సరాలు దాటినా నేటికీ పూర్తి కాలేదని ఆరోపించారు. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కొర్ర సైదానాయక్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వదూద్, ముడావత్ జగన్‌నాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కోర్సులకు ఆహ్వానం

నల్లగొండ: నల్లగొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో కిషోర బాలికల పథకం ద్వారా ప్రారంభించే వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ కేంద్రం జిల్లా మేనేజర్ ఎ.అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల కిశోర బాలికలు బయోడటా జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌ఫోర్టు సైజ్ ఫొటోలతో నల్లగొండ పట్టణంలోని రామనగర్‌లో గల మహిళా ప్రాంగణంలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ : 766002517, 08682–244416 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



ఆర్ఐ శ్యాంకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ శ్యాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కూల మట్టయ్య మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కేసీఆర్ విఫలమయ్యారని ఆరోపించారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. గిరిజన బంధు, బీసీ బంధు అమలు చేయాలన్నారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు వస్కూల సైదమ్మ, ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్, ఏఐఎఫ్‌డీవై జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షులు కిరణ్, గోపి, ఏఐఎఫ్‌డీడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు రామాంజి జ్యోతి, గడ్డి వీరయ్య, సందీప్ తదితరులున్నారు.

ఆర్డీఓ కార్యాలయం ముట్టడి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవరకొండ: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్‌నాయక్, బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కిరణ్, శ్రీకాంత్, రాజేష్, మల్లీశ్వరి, మౌనిక, విద్యార్థులు తదితరులున్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ



సర్టిఫికెట్లతో విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్: వరంగల్‌లోని మున్సిపల్ స్టేడియంలో గురు అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 6న నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మిర్యాలగూడ పట్టణంలోని నవ జ్యోతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు సుమన్ షాటోఖాన్ కరాటే అకాడమీ జాతీయ కార్యదర్శి, మాస్టర్ రామకృష్ణానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్లూ బెల్ట్ కటాస్ విభాగంలో దేవఫ్ ద్వితీయ స్థానం సాధించగా.. ఎల్లో బెల్ట్ కటాస్ విభాగంలో జాన్‌వెస్లీ ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ చార్లెస్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట: మండలంలోని గుంటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల బంజారాతండాకు చెందిన 50 కుటుంబాలు జాలె నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ, ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పింఛన్లను పెంచనున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో సూర్యనాయక్, లాల్‌సింగ్, చంద్రు, మోత్యా, నవీన్‌నాయక్, బద్రి, దోలీ, గణేశ్ తదితరులున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, ముక్కమల వెంకటయ్య, లోకసాని కృష్ణ, సాధిక్, బద్యానాయక్, కిన్నెర హరికృష్ణ, ఎంపీటీసీ మల్లయ్య, పాండు, పాపానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సిమెంట్ బెంచీల ఏర్పాటు

చింతపల్లి: మండల పరిధిలోని వింజమూరు గ్రామానికి చెందిన మునుకుంట్ల శ్రీకాంత్ గత నెలలో మృతిచెందాడు. శ్రీకాంత్ జ్ఞాపకార్థం అతడితో పాటు పదో తరగతి చదువుకున్న స్నేహితులు సోమవారం గ్రామంలో రూ.20వేలతో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యాచారం దవలయ్య, శివ, ఆరెకంటి మహేందర్, శ్రీకాంత్, రామకృష్ణ, గణేశ్, అనిల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

భూమి కేటాయించాలని వినతి

మిర్యాలగూడ టౌన్: అద్దె భవనాల్లో కొనసాగుతున్న గిరిజన హాస్టల్‌కు సొంత భవనం నిర్మించేందుకు గాను మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామ శివారులోని సర్వే నంబర్ 834లో గల ప్రభుత్వ భూమిని కేటాయించాలని సోమవారం తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధనావత్ సిద్ధునాయక్, ఉపాధ్యక్షుడు చందునాయక్, పవన్‌నాయక్, శివనాయక్, రమేష్‌నాయక్ తదితరులున్నారు.

ఓపెన్ స్కూల్ సద్వినియోగం చేసుకోవాలి

కొండమల్లేపల్లి: బడి మానేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మంద సత్యనారాయణ అన్నారు. సోమవారం కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఓపెన్ స్కూల్‌లో నమోదు అయ్యేందుకు జెడ్పీహెచ్ఎస్‌లో ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జి కర్నాటి వెంకటేశ్వర్లును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్. శ్రీనయ్య, జనార్దన్‌రెడ్డి, సూర్య, శ్రీపతిరావు, చంద్రయ్య, ఈదయ్య, జగదీశ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరిని విజయవంతం చేయాలి

మాడుగులపల్లి: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 13న నిర్వహించనున్న యాదవ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ సభకు పార్టీలకతీతంగా యాదవులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

నిర్మాణ పనులు ప్రారంభం

పెద్దవూర: మండలంలోని పర్వేదుల, తుంగతూర్తి గ్రామాల్లో చేపట్టిన నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను సోమవారం ఆయా గ్రామాల సర్పంచులు దండ మనోహర్‌రెడ్డి, మెండె విష్ణుప్రియాసైదులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎండీ సాధిక్, రవీందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే బషీర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆకలి నిర్ధారణ పరీక్షలు

అడవిదేవులపల్లి: మండలంలోని కొత్తనందికొండ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహారం లోపం ఉన్న పిల్లలకు వైద్య సిబ్బంది ఆకలి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉపేందర్, స్థానిక సర్పంచ్ రమావత్ బాలునాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, సీహెచ్ఓ షాహిద్ తదితరులు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఉన్నారు.

మణిపూర్ అల్లర్లకు నిరసనగా బంద్

మిర్యాలగూడ టౌన్: దేశంలో ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, హత్యలతో పాటు మణిపూర్‌లో చోటుచేసుకున్న అల్లర్లను నిరసిస్తూ రాష్ట్రీయ ఆదివాసీ ఏక్తా పరిషత్, భారత ముక్తి మోర్చా, బహుజన క్రాంతి మోర్చా పిలుపు మేరకు సోమవారం మిర్యాలగూడ పట్టణంలో బంద్ నిర్వహించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూసుఫ్, జానీబాబా, మహ్మద్ చావుస్, రవికుమార్, నాయుడు, వజ్జగిరి అంజయ్య తదితరులున్నారు.

రైతుల పేరిట రుణాలన్నీ మాఫీ చేయాలి

నిడమనూరు: 2023 వరకు రైతుల పేరున ఉన్న అన్ని వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిడమనూరు మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. 2018 నుంచి రుణమాఫీ కాక అప్పులు పెరిగిపోయాయని అన్నారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ తదితరులున్నారు.

ఎంఈఓకు వినతి

చింతపల్లి: మండల పరిధిలో ఉపాధ్యాయుల సర్దుబాటును పారదర్శకంగా చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గ్యార సంపత్, జిల్లా కార్యదర్శి కోట్ల యాదగిరి కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ గురవారావుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే ఇవ్వాలని కోరారు. వారి వెంట పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

వైరల్‌గా మారిన కొత్త మండలం కూర్పు

గుర్రంపోడు: ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న గుడిపల్లి మండలంలోకి గుర్రంపోడు మండలంలోని కొన్ని గ్రామాలు చేరుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ఓ మ్యాపు వైరల్ అవుతోంది. పాల్వాయి పరిసర గ్రామాలు గుడిపల్లి మండలంలో చేరుతాయని ప్రచారం జరుగుతుండగా ఇక్కడి నాయకులు మాత్రం అంతా ఊహాగానాలేనని కొట్టిపడేస్తున్నారు.

జిల్లా ఏర్పాటుపై మాట్లాడటం హర్షణీయం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడను జిల్లాగా ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు సోమవారం అసెంబ్లీలో మాట్లాడం పట్ల జిల్లా సాధన సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మారం శ్రీనివాస్, మాలోతు దశరథనాయక్, సర్నాల వెంకయ్య, పరమేష్, కోటయ్య, మాడుగుల శ్రీనివాస్ తదితరులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.